

కళేకుర్తి బ్రిడ్జికి రూ.48 కోట్లు

కణేకల్లు, అక్టోబరు 8: కళేకుర్తి వద్ద రూ.48 కోట్లతో బ్రిడ్జిని నిర్మించేందుకు ఆర్థికశాఖ మంగళవారం ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. కణేకల్లుకు వచ్చిన ఆయన ఈ విషయం గురించి మాట్లాడారు. రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే కళేకుర్తి బ్రిడ్జి నిర్మాణం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు. ఐదుగురు సభ్యుల కమిటీ తీర్మానం చేయడంతో ఆర్థికశాఖ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలోనే బ్రిడ్జి పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే అన్నారు.

నిప్పు వెనుక నిజమేమిటి..!

ఈశ్వర్ రెడ్డి ఒక్కడే అంటించాడా..?

మరికొందరి పాత్రపై అనుమానాలు

రెండు వారాలుగా సాగుతున్న దర్యాప్తు



అనంతపురం క్రైం: రాములోరి రథానికి నిప్పు పెట్టిన వ్యవహారం పోలీసులకు తలనొప్పిగా మారింది. ప్రధాన నిందితుడు బోడిమల్ల ఈశ్వర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. నిప్పు పెట్టింది తానొక్కడినే అని ఈశ్వర్ రెడ్డి పోలీసులకు చెబుతున్నట్లు సమాచారం. కానీ మరికొందరి మద్దతుతోనే నిప్పు పెట్టి ఉంటాడని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. పోలీసులు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. సున్నితమైన అంశం కావడంతో పోలీసులు ఈ కేసులో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామంలో గత నెల 23వ తేదీ అర్ధరాత్రి రాములోరి రథానికి నిప్పంటించారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. విచారణకు ఆదేశించారు. ఆ తరువాత మూడు రోజులకే అదే గ్రామానికి చెందిన బోడిమల్ల ఈశ్వర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఒక్కడేనా..?

గ్రామస్థుల సహకారం లేకుండా.. ఒకే కుటుంబం రథాన్ని తయారు చేయించడమే ఈ ఘటనకు కారణమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈశ్వర్ రెడ్డిని అదుపులోకి తీసుకోగానే పోలీసులు విచారించారు. తానొక్కడినే నిప్పంటించానని పోలీసుల ఎదుట చెప్పినట్లు సమాచారం. రిమాండ్ సమయంలో పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో కూడా ఈశ్వర్‌రెడ్డి ఎవరికీ సంబంధం లేదని, తానొక్కడినే బాధ్యుడినని చెప్పుకొచ్చినట్లు సమాచారం. తాను వాడిన పెట్రోల్ బాటిల్, రథ మండపానికి వేసిన తాళం పగలకొట్టిన విధానం, నిప్పు అంటించిన తీరు గురించి పోలీసులకు వివరించినట్లు తెలిసింది. పోలీసుల పరిశీలనలో ఈశ్వర్ రెడ్డి నిజమే చెప్పినట్లు ఆనవాళ్లు కనిపించాయి. అయినా, ఒక్కడు కాదు.. మరికొందరు ఉన్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. నివృత్తి చేసుకునేందుకు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు.

తేలని వ్యవహారం

రథానికి నిప్పంటించిన కేసు దర్యాప్తు ముందుకు సాగడం లేదు. అర్ధరాత్రి సమయంలో ఒక్కడే తాళాలు పగలగొట్టి, పెట్రోల్ పోసి నిప్పంటించారంటే నమ్మశక్యంగా లేదని పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామస్థులు అనుమానిస్తున్న ఐదారుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో కొందరు పొంతనలేని సమాధానాలు చెప్పగా.. మరికొందరు తమ పాత్రేమీ లేదని చెప్పినట్లు తెలిసింది. దీంతో పోలీసుల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఈశ్వర్‌రెడ్డి స్నేహితుడిపైనా అనుమానాలు వ్యక్తమైనట్లు సమాచారం. ఆ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేశారని తెలిసింది. రాయదుర్గం రూరల్ పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితులను రెండు వారాలుగా పోలీసులు అదుపులో ఉంచుకున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.



దారి దోపిడీ..!

పొలం దారులను బాగు చేసుకున్న రైతులు

ఎకరానికి రూ.500 తగ్గకుండా విరాళాలు

దొంగ బిల్లులు చేసుకున్న వైసీపీ నాయకులు



హావళిగి-కళవళ్ల తిప్ప రోడ్డు(డ్యాంరోడ్డు)

వైసీపీ ఓటమికి ప్రధాన కారణాల్లో 'దారులు' ఒకటి. గుంతలమయమైన రోడ్ల గురించి ఎన్నడూ పట్టించుకోలేదు. దీంతో పల్లె ప్రాంతాల్లో రైతులు స్వచ్ఛందంగా మట్టి వేసి దారులను బాగు చేసుకున్నారు. విడపనకల్లు మండలంలోనూ ఇదే తరహాలో రైతులు చందాలు వేసుకుని పనులు చేసుకున్నారు. కానీ ఈ పనులు తామే చేసినట్లు చూపించుకుని.. కొందరు వైసీపీ నాయకులు ఉపాధి బిల్లులు పెట్టుకుని రూ.లక్షలు కాజేశారు. విషయం తెలుసుకున్న రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. - విడపనకల్లు



వైసీపీ నేతలకు చేసిన బిల్లులు

హావళిగి నుంచి కలవళ్లి తిప్ప (డ్యాం) రోడ్డు గుంతలు పడి.. నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి ఉండేది. వైసీపీ హయాంలో ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో ఆ దారికి ఇరువైపులా పొలాలు ఉండే రైతులు ఎకరానికి రూ.500 నుంచి రూ.వెయ్యి ప్రకారం చందాలు వేసుకుని.. రోడ్డు వేసుకున్నారు. ఈ మార్గంలో హావళిగి నుంచి చివరి వరకూ ఆరు వేల ఎకరాలకు పైగా సాగు భూమి ఉంది. పెద్ద రైతులు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకూ ఇచ్చారు. చిన్న రైతులు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ఇచ్చారు. ఈ సొమ్ముతో హావళిగి నుంచి రాయాపురం వెళ్లే, జగనన్న కాలనీకి వెళ్లే దారిని బాగు చేసుకున్నారు. పార్టీలకు అతీతంగా రైతులందరూ ఇందులో భాగమయ్యారు. ఇంత వరకూ బాగానే ఉన్నా, రైతులు వేసుకున్న ఈ రోడ్డును తామే వేసినట్లు చూపించి.. వైసీపీ నాయకులు ఉపాధి బిల్లులు చేసుకుని స్వాహా చేశారు. గత ఏడాది సెప్టెంబరు 21న ఒక్కో రోడ్డుకు రూ.34 వేల నుంచి రూ.1.40 లక్షలు బిల్లులు చేయించారు. డ్యాం రోడ్డు, రాయాపురం రోడ్డు, కలవళ్లితిప్ప రోడ్డు, వేల్పుమడుగు తిప్ప రోడ్డు, పొలాలకు వెళ్లే దారులకు రైతులు మట్టి తోలించుకుని బాగు చేసుకోగా.. వైసీపీ నాయకులు బిల్లులు కాజేశారు. సుమారు రూ.15 లక్షలు కాజేశారని రైతులు అంటున్నారు.



హావళిగి-రాయాపురం రోడ్డు

మట్టి వేయించాము..

రోడ్డుకు ట్రాక్టర్లతో మట్టి వేయించాము. వైసీపీ నాయకులు చేసిన పనులకు తక్కువ బిల్లులు చేశాము. ఒక్కొక్క రోడ్డుకు రూ.లక్ష నష్టానికి బిల్లులు పెట్టాము. రోడ్లు వేయించిన తరువాతనే బిల్లులు చేశాము. వేల్పుమడుగు రోడ్డు వేశారా లేదా అనే విషయం నాకు తెలియదు. ఎక్కడా దొంగ బిల్లులు పెట్టలేదు. - **రామ్మోహన్, టీఏ**

ఒక్క రోడ్డూ వేయలేదు..



పొలాలకు వెళ్లే మట్టి రోడ్లు అధ్వానంగా ఉంటే మేమే చందాలు వేసుకుని బాగు చేసుకున్నాం. ఒక్కొక్క రైతు ఎకరానికి రూ.500 తగ్గకుండా విరాళాలు ఇచ్చారు. మేము చేయించుకున్న పనులకు వైసీపీ నాయకులు బిల్లులు చేయించుకున్నారు.

- వన్నూరుస్వామి, రైతు

దొంగ బిల్లులు..



ఆ దారిలో నాకు మూడు ఎకరాలు పొలం ఉంది. నా వంతుగా ఎకరానికి రూ.700 ప్రకారం రూ.2100 ఇచ్చాను. పొలాలకు వెళ్లే దారి భయంకరంగా ఉండేది. ఎద్దుల బండ్లు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. పోయిన ఏడాదే మట్టి రోడ్లు వేయించుకున్నాము. పనులు మేము చేయించుకుంటే.. వైసీపీ నాయకులు దొంగ బిల్లులు పెట్టుకున్నారు.

- భూమా, రైతు

మా డబ్బులు..



డ్యాం రోడ్డులో నాకు ఎనిమిది ఎకరాల పొలం ఉంది. ఎకరానికి వెయ్యి ప్రకారం రూ.8 వేలు నా వంతుగా విరాళం ఇచ్చాను. రైతులందరం కలిసి పొలాలకు వెళ్లేదారిని బాగు చేయించుకున్నాము. రోడ్లు వేయించామని ఎవడో బిల్లులు తీసుకుంటే ఎలా ఊరుకుంటాము..? డబ్బులు మావి.. బిల్లులు వారికా..?

- షన్ముఖ, రైతు



శ్రీ పీఠే.. సురపూజితే!

కొత్తూరు అమ్మవారిశాలలో వాసవీమాతకు వక్కల అలంకరణ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలకు భక్తులు విశేషంగా తరలివచ్చి పూజలు నిర్వహించుకుంటున్నారు.

పల్లె పండుగను ఘనంగా నిర్వహించాలి

■ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం, కలెక్టర్, జిల్లా అధికారులు

అనంతపురం టౌన్, అక్టోబరు 8: పల్లె పండుగను ప్రతి పంచాయతీలో ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా అధికారులతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆగస్టు 23న గ్రామ సభలలో తీర్మానం చేసి పంపిన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపి పంపించామని అన్నారు. ఆ పనులకు సంక్రాంతి లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో పనుల శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాలలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల వివరాలు ఆయా గ్రామాల ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని అన్నారు. జిల్లాలో చేపట్టే పనులకు వందశాతం మంజూరు ఉత్తర్వులు ఇచ్చామని కలెక్టరు వినోద్ కుమార్ డిప్యూటీ సీఎంకు తెలిపారు. జిల్లాలో మౌలిక సదుపాయాలు ఎక్కువగా కల్పించాల్సి ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు చిత్తశుద్ధితో పనిచేస్తామని అన్నారు.

దివ్యాంగుల నిరీక్షణ

మూడు నెలలుగా అందని పరికరాలు

ఆన్‌లైన్ పద్ధతి ప్రవేశపెట్టిన ప్రభుత్వం



అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 8: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ద్వారా దివ్యాంగులకు మూడు నెలలుగా పరికరాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దివ్యాంగులకు అందించే పరికరాలకు ఆన్‌లైన్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సంఖ్య ఆధారంగా పరికరాలను మంజూరు చేస్తారని ఆ శాఖ అధికారులు అంటున్నారు. కానీ ఆన్‌లైన్ పద్ధతిపై గైడ్‌లైన్స్ రాలేదని అంటున్నారు. దివ్యాంగులకు చంక కర్రలు, చేతి కర్రలు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, ఉన్నత చదువులు చదివేవారికి ల్యాప్‌టాప్‌లను విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా అందిస్తారు. గతంలో జిల్లా అధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ పెడితే పరికరాలు వచ్చేవి. అనంతరం దరఖాస్తులు ఆహ్వానించి.. లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. ప్రజాప్రతినిధులు లేదా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పంపిణీ చేసేవారు. కొత్త పద్ధతి అమలులోకి వచ్చాక దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి.. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు వారికి సర్దిచెప్పి పంపుతున్నారు. ప్రస్తుతం కార్యాలయంలో చంక కర్రలు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు మాత్రమే ఉన్నాయని ఆ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ తెలిపారు. ఏ పరికరాలైన సరే ఆన్‌లైన్ దరఖాస్తుల ఆధారంగా అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి నియమ నిబంధనలు వస్తాయని తెలిపారు.

ఆట మొదలైంది..!

హౌసింగ్ అక్రమార్కులపై చర్యలు

అనకొండ డీఈఈ, ఏఈ సస్పెన్షన్

మరో ఎనిమిది మందిపై చార్జెస్ ఫ్రేమ్

గృహ నిర్మాణ శాఖ ఎండీ ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



హౌసింగ్‌లో అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాల్లో కొన్ని..

అనంతపురం సిటీ, అక్టోబరు 8: హౌసింగ్‌లో అక్రమాలపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాల ఆధారంగా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఒక డీఈఈని, ఆయన కింద పని చేసే ఒక ఏఈని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఇద్దరు రిటైరైనవారితో సహా ఎనిమిది మంది ఇంజనీరింగ్ అధికారులపై అభియోగాలు నమోదు (చార్జెస్ ఫ్రేమ్) చేసినట్లు తెలిసింది. అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ చేసిన అక్రమాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. అక్రమాలలో హౌసింగ్ అధికారుల పాత్రను బయటపెట్టింది. 'రెడ్‌మార్క్ దందా..!, ఇంకా స్వామి భక్తి..!, నిజం తేలేనా..?, హౌసింగ్‌లో అనకొండ, దొరికినంత దోచేశారు.!, అలాంటిలాంటోడుకాదు..!' శీర్షికలతో వరస కథనాలను ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆంధ్రజ్యోతి కథనాల ఆధారంగా తన నియోజకవర్గంలో జరిగిన అక్రమాలను సీఎం చంద్రబాబు, హౌసింగ్ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్సు విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో తాజాగా పది మంది హౌసింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు ఆ శాఖ ఎండీ నుంచి మంగళవారం జిల్లా హౌసింగ్ పీడీకి ఉత్తర్వులు వచ్చాయి.

ఇప్పటికి పది మంది..

హౌసింగ్‌లో జరిగిన అక్రమాలపై ఆ శాఖ ఎండీ సమగ్ర విచారణ జరిపించారు. మొత్తం పది మందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఆంధ్రజ్యోతి కథనాల ఆధారంగా అనకొండ డీఈఈ, ఆయన కింద పనిచేసిన ఒక ఏఈని సస్పెండ్ చేశారని తెలిసింది. మరో ఐదుగురు ఏఈలు, ఇద్దరు రిటైర్డు ఈఈలు, ఒక డీఈఈపై చార్జెస్ ఫ్రేమ్ చేశారని సమాచారం. వీరితో పాటు కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. విజిలెన్సు విచారణ జరుగుతుండగానే ఆ శాఖ ఎండీ ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం చర్చనీయాంశమైంది. మొత్తంగా కూటమి ప్రభుత్వం హౌసింగ్ అక్రమార్కులపై కొరడా ఝులిపించిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రాక్రీట్ సంస్థపై ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకుంటుందో అన్న చర్చ ఆ శాఖలో జరుగుతోంది.

ముందే పండుగ

కేజీబీవీ ఉద్యోగులకు రెండు నెలల జీతాలు, డైట్ బిల్లులు మంజూరు

మొత్తం రూ.17 కోట్లకుపైగా విడుదల.. ఉద్యోగుల ఆనందం

8లో

అన్ని సొసైటీల్లో ఎరువులను అమ్మాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



అనంతపురం టౌన్, అక్టోబరు 8: జిల్లాలోని అన్ని కో ఆపరేటివ్ సొసైటీలలో ఎరువుల అమ్మకాలు జరిగేలా చూడాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సొసైటీలు రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. జిల్లాలో 34 కో ఆపరేటివ్ సొసైటీలు ఉన్నాయని, ఇందులో కేవలం 11 సొసైటీలలో మాత్రమే ఎరువులను అమ్ముతున్నారని అన్నారు. మిగిలిన సొసైటీలలో నెలలోపు ఎరువుల అమ్మకాలను ప్రారంభించాలని ఆదేశించారు. ఎంపీఎస్‌సీ గోడౌన్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జిల్లాకు 52 మల్టీపర్పస్ ఫెసిలిటీ గోడౌన్‌లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 50 గోడౌన్‌ల నిర్మాణం పురోగతిలో ఉందని, నెలలోగా పూర్తి చేసి అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. సొసైటీలలో రుణాలు పొందిన రైతుల డేటా కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పురోగతి సమాచారాన్ని రోజువారీగా తెలపాలని ఆదేశించారు. లక్ష్య సాధనకు భిన్నంగా వ్యవహరించే సొసైటీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీసీఓ అరుణకుమారి, డీపీఓ నాగరాజు నాయుడు, డీసీఈబీ సీఈఓ సురేఖారాణి, మత్స్యశాఖ డీడీ శ్రీనివాస నాయక్, డీపీడీఎం తేజస్విని, వ్యవసాయశాఖ ఏడీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బడికి చేయూతనిద్దాం

చదువుకున్న పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి చేయూతనిద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలని సూచించారు. వారితో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయించాలని అన్నారు. జిలాలో చదివిన అధికారులు, పూర్వ విద్యార్థులను వారంలోగా వాట్సాప్ గ్రూపులలో చేర్చాలని ఆదేశించారు. పూర్వ విద్యార్థుల నుంచి వస్తు, ధన రూపంలో విరాళాలను సేకరించాలని సూచించారు. సాయం చేసిన వారిపేర్లు నమోదు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

ఈ ఒక్క రోజే..!

అనంతపురం అర్బన్, అక్టోబరు 8: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు గడువు బుధవారం ముగియనుంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకూ 1314 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం ఒక్క రోజే 668 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తు చేసుకునే వీలు ఉంటుందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమీషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అతిథిలా..



ట్రాన్స్‌కో కార్యాలయం

ట్రాన్స్‌కో కార్యాలయంలో వింత పోకడ

చుట్టపుచూపుగా వస్తున్న ఉన్నతాధికారి

మామూళ్లు ఇస్తేనే పనులు జరుగుతాయ్!

కార్యాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యం

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాడిపత్రి, అక్టోబరు 8: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయానికి ఓ ఉన్నతాధికారి చుట్టపుచూపుగా వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నెలలో నాలుగు సార్లు మాత్రమే కార్యాలయానికి ఆయన వస్తుండటంతో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విసుగు చెంది ఎవరైనా అక్కడి సిబ్బందిని ప్రశ్నిస్తే 'సార్ క్యాంప్‌కు వెళ్లారు. రావడానికి నాలుగైదు రోజులు పట్టవచ్చు, తర్వాత రండి' అంటూ చెబుతున్నారు. సరేలే మళ్లీ వద్దామని వారంరోజుల తర్వాత వచ్చినా ఆ అధికారి మాత్రం కనబడడు. దీంతో సమస్యల పరిష్కారం కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పలు మార్లు కార్యాలయం వద్ద ధర్నా చేసినా అధికారి లేక పోవడంతో ఫలితం లేకుండాపోతోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉంటూ ప్రజలకు సేవలు అందించాల్సి ఉంటుంది. కానీ ఆ ఉన్నతాధికారి మాత్రం స్థానికంగా నివాసం ఉండకుండా రాయలసీమ జిల్లాల్లోని ఓ పట్టణం నుంచి వస్తున్నాడన్న ప్రచారం ఉంది. వారంలో ఒకరోజు వచ్చి కార్యకలాపాలను చూసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఆ ఇద్దరే ఆయనకు బలం

ఆ ఉన్నతాధికారి వద్ద పని జరగాలంటే ముందుగా కార్యాలయంలోని కిందిస్థాయి అధికారుల్లో ఇద్దరిని కలవాలి. ఆ ఉన్నతాధికారి ఆ ఇద్దరిని తన కార్యకలాపాలను నిర్వహించడం కోసం, మామూళ్లను వసూలు చేయడం కోసం ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎవరైనా సరే వారిద్దరి వద్దకు వెళ్లి రేటు మాట్లాడుతుకుని పని చేయించుకోవాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు తాడిపత్రి మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలోని ఓ పరిశ్రమకు ఇచ్చిన అధిక స్లాబ్‌ను తగ్గించి సాధారణ మీటర్‌ను ఇవ్వాలని యజమాని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేశాడు. పని జరగదని తెలుసుకున్న ఆ యజమాని సిబ్బందిని విచారించగా ఆ ఇద్దరిని కలవాలని సలహా ఇచ్చారు. దీంతో ఇద్దరిని కలవగా నీ పని పూర్తి కావాలంటే రూ.80వేలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. మీటర్ మార్చేందుకు కూడా డబ్బులు ఇవ్వాలా అని ఆశ్చర్యపోయిన ఆయన అంత ఇచ్చుకోలేను అని బేరసారాలు జరపగా చివరికి రూ.50వేలకు డీల్ కుదిరినట్లు తెలిసింది. ఇలా వారంరోజులపాటు తంతు నడిచిన తర్వాత ఒకరోజు వీలు చేసుకొని ఆ అధికారి కార్యాలయానికి వచ్చి పని చూసుకొని సంతకాలు చేసి రావాల్సిన ముడుపులు జేబులో నింపుకొని ఆ ఇద్దరికి వాటాలు ఇచ్చి వెళుతున్నాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

సిబ్బంది ఇష్టారాజ్యం

ట్రాన్స్‌కో కార్యాలయంలో ఉన్నతాధికారి విధులకు సరిగా రాకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. పలువురు ఉద్యోగులు కూడా ఉదయం ఆలస్యంగా విధులకు రావడం, వచ్చి రాగానే బయటకు వెళ్లడం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. కార్యాలయానికి వచ్చిన ప్రజలు అక్కడ ఎవరూ ఉండకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. తీరా సిబ్బంది వచ్చిన తర్వాత సమస్యను వివరిస్తే పెద్దసారు లేడు వచ్చినప్పుడు రావాలని తీరిగ్గా సమాధానం ఇస్తున్నారు. చివరికి కరెంట్ ఎప్పుడు వస్తుందని ప్రజలు ఫోన్‌చేస్తే ఎత్తే నాథుడే లేడు. కొన్నిసార్లు స్విచ్ఛాఫ్ కూడా వస్తుండటంతో ప్రజలు విసిగిపోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం ప్రదక్షిణలు చేశా

మూతపడ్డ గ్రానైట్ ఫ్యాక్టరీకి అధిక బిల్లులు వస్తుండటంతో ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో సింగిల్ ఫేజ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేశా. ఉన్నతాధికారులు వస్తేనే నీ పని జరుగుతుందని సిబ్బంది చెప్పడం, నేను వెనుదిరగడం పరిపాటిగా మారింది. చివరికి సోలార్ లైట్లను ఏర్పాటు చేసుకున్నాం. **- రమణ, తాడిపత్రి**

అధికారులు కార్యాలయాలకు రావడం లేదు



ట్రాన్స్‌కో కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలలో కొన్ని రోజులు మాత్రమే విధులకు వస్తున్నారు. దీంతో పలు సమస్యలపై వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఫోన్ చేసినా అధికారుల నుంచి స్పందన ఉండటం లేదు. **- చిరంజీవి, సీపీఐ పట్టణ కార్యదర్శి**

మా దృష్టికి రాలేదు

ఈ విషయం నా దృష్టికి రాలేదు. కార్యాలయంలో విచారించి చర్యలు తీసుకుంటాం. రాతపూర్వకంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

- రాజశేఖర్, ట్రాన్స్‌కో డీఈ

కొనసాగిన పప్పుశనగ రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, అక్టోబరు 8: సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం ఎనిమిదో రోజు కొనసాగింది. ఇప్పటి దాకా 11822 మంది రైతులు 16410 క్వింటాళ్ల పప్పుశనగ కోసం తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విత్తన పప్పుశనగ కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.

ఎఫ్ఎస్ఎస్ఏఐతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 8: ఆహార భద్రతా ప్రమాణాల్ని మరింత పెంచడానికి భారత ఆహార భద్రత సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం ఢిల్లీలో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒప్పందం విలువరూ.88కోట్లని తెలిపారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ)కమలవర్ధనరావు, ఏపీఫుడ్ సేఫ్టీ కమిషనర్ హరికిరణ్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇనోషిశర్మ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఆహార పరీక్షల ప్రయోగశాలలు ఏర్పాటు చేసేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సుముఖత వ్యక్తం చేసిందని మంత్రి పేర్కొన్నారు. రూ.20కోట్లతో తిరుమలలో నూ, మరో రూ.20కోట్లతో కర్నూలోనూ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ ల్యాబ్‌లను నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఒంగోలులో ప్రాథమిక ఆహార పరీక్షల ప్రయోగశాలల్ని ఒక్కొక్కటి రూ.7.5కోట్లతో నెలకొల్పనున్నామన్నారు. రాష్ట్రంలో ఆహార శాంపిళ్ల సేకరణ, విశ్లేషణ కోసం రూ.12కోటు, ఆహారభద్రతా ప్రమాణాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రూ.11కోట్లు కేటాయించేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 4 మొబైల్‌ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లకు అదనంగా మరో 22 ల్యాబ్‌లను టర్న్‌కీ విధానంతో వాడుకునేందుకు రూ.15కోట్లు కేటాయించడానికి ఒప్పందం కుదిరిందని వివరించారు.

ముగిసిన ఆంధ్రా రంజీ జట్టు శిక్షణ శిబిరం


శిక్షణలో పాల్గొన్న ఆంధ్రా రంజీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 8: గత పదిరోజులుగా స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆంధ్రా రంజీ క్రికెట్ జట్టు శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. 2024-25 సీజన్‌కు సంబంధించి ఆంధ్రా జట్టు ఈనెల 11 నుంచి నాగ్‌పూర్‌లో విదర్భతో జరిగే రంజీ మ్యాచ్ ఆడుతుంది. జట్టులో రిక్కీ భూయ్, కేఎస్ భరత్, హనుమ విహారి, అశ్విన్ హెబ్బార్, శశికాంత్, స్టీఫెన్, నితీష్‌కుమార్ రెడ్డి ప్రధాన ఆటగాళ్లు ఉన్నారు. కార్యక్రమంలో హెడ్‌కోచ్ తిను యోహాన్, బ్యాటింగ్ కోచ్ జ్ఞానేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ విక్రంవర్మ, ఫీల్డింగ్ కోచ్ శివకుమార్ రాజు, జేటీ యాదవ్, శ్రీనివాసరావు, జై కృష్ణ, రాజు, ఫైడి రాజు, ఇమామ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ముందే దసరా పండుగ

- కేజీబీవీ ఉద్యోగులకు రెండు నెలల జీతాలు, డైట్ బిల్లులు మంజూరు
- మొత్తం రూ.17 కోట్లకు పైగా విడుదల
- ఉద్యోగుల ఆనందం

అనంతపురం విద్య, అక్టోబరు 8: కేజీబీవీల్లో పనిచేసే ఉద్యోగులకు ముందుగానే దసరా వచ్చినట్లైంది. ఉద్యోగులు సమస్యలు గుర్తించిన కూటమి ప్రభుత్వం రెండు నెలల జీతాలు, డైట్ బిల్లులు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 2800 కేజీబీవీల టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలకు, కేజీబీవీల్లో చదువుకనే విద్యార్థులకు డైట్ చార్జీల కోసం కోట్ల రూపాయల నిధులు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 62 కేజీబీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు 2 నెలల జీతాల కోసం రూ.13.14 కోట్లు, డైట్ బిల్లుల కోసం మరో రూ. 4.70 కోట్లు విడుదల చేశారు. ఈ మేరకు ఇటీవల స్టేట్ ప్రాజక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు జీతాల కోసం అనంతపురం జిల్లాకు రూ. 3.42 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ. 3.26 కోట్లు విడుదల చేశారు. సెప్టెంబరు జీతాల కోసం అనంతపురం జిల్లాకు రూ. 3.24 కోట్లు, సత్యసాయి జిల్లాకు రూ. 3.20 కోట్లు విడుదల చేశారు. మొత్తంగా రెండు జిల్లాలకు కలిపి జీతాలకే రూ.13.14 కోట్లు విడుదల చేశారు. డైట్ చార్జెస్ కింద ఆగస్టు నెలకు అనంతపురం జిల్లాకు రూ. 1.18 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ. 95.15లక్షలు, సెప్టెంబరు నెలకు అనంతపురం జిల్లాకు రూ.1.38 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి రూ. 1.18 కోట్లు విడుదల చేశారు. రెండు జిల్లాలకు జీతాలు, డైట్ బిల్లుల కోసం ప్రభుత్వం ఏకంగా రూ. 17 కోట్లకు పైగా విడుదల చేసింది. వైసీపీ పాలనలో నెలల తరబడి పెండింగ్ పెట్టేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు, డైట్ బిల్లులు అందుతుండటంతో ఆనందం వ్యక్తం చేశారు.


సమగ్రశిక్ష ప్రాజెక్టు, అనంతపురం

రెండు నెలల జీతాలు, డైట్ బిల్లులు అందించాం



స్టేట్ ప్రాజెక్టు ఆఫీస్ నుంచి రెండు నెలలకు సంబంధించి జీతాలు, డైట్ కోసం బడ్జెట్ విడుదలైంది. పండుగ రోజుల్లో ఉద్యోగులు, సిబ్బంది ఎవరూ ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో బిల్స్ బ్యాంకుకు పంపాం. ఇప్పటికే ఒక నెల జీతం ఉద్యోగుల ఖాతాలకు జమ అయ్యింది. మరో నెల జీతాలు, డైట్ బిల్లులు కూడా బుధవారం ఉదయం లేదా మధ్యాహ్నంలో జమ అవుతాయి.

- నాగరాజు, ఏపీసీ, సమగ్రశిక్ష, అనంతపురం.

మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం



సమగ్రశిక్ష ఉద్యోగులకు రెండు నెలల జీతాలు, డైట్ బిల్లుల పెండింగ్ ఉన్న సమస్యను ప్రజాదర్బార్‌లో విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాం. దసరా పండుగలోపు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆమేరకు సుమారు 17 కోట్లు రెండు జిల్లాలకు విడుదల చేయడం, పండగ కంటే ఆనందంగా ఉంది.

- విజయ్, జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్

గుట్టుగా.. గట్టెక్కే ఎత్తుగడ..!

కాజేసిన భూమి ఇద్దరు రైతులకు వాపసు

మిగిలిన రైతుల కళ్లుగప్పి.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ

పట్టా భూములను కంపెనీకి అమ్మేసిన రియల్టర్లు


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రియల్టర్లు, ప్రైవేటు కంపెనీ నిర్వాహకులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 8: రైతుల పట్టా భూములను గుట్టుగా ఓ ప్రైవేటు కంపెనీకి విక్రయించిన రియల్టర్లు.. ఆ వివాదం నుంచి గుట్టుగా గట్టెక్కేందుకు ప్రయత్నించారు. కాజేసిన భూముల్లో ఇద్దరు రైతులకు తిరిగి రిజిస్ట్రేషన్ చేయించి.. గుట్టుచప్పుడు కాకుండా జారుకోవాలని చూశారు. విషయం తెలుసుకున్న మిగిలిన రైతులు చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు మంగళవారం రావడంతో అక్కడి నుంచి జారుకున్నారు. న్యామద్దల చెరువు ఆయకట్టులో పట్టా భూములను కొందరు రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారు. వీటిపై కన్నేసిన కొందరు రియల్టర్లు.. గుట్టుగా కాజేసి ఓ ప్రైవేటు కంపెనీకి విక్రయించారు. ఈ విషయం గురించి ఆలస్యంగా తెలుసుకున్న రైతులు ఏడాది క్రితం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. బాధిత రైతులు రియల్టర్లను, కంపెనీ నిర్వాహకులను గట్టిగా నిలదీస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు ముగ్గురు రైతులకు వారి భూములను తిరిగి రిజిస్ట్రేషన్ చేయించి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు రైతులకు మంగళవారం గుట్టుగా రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియను చేపట్టారు. విషయం బయటకు పొక్కడంతో మరికొందరు బాధితులు అక్కడికి చేరుకుని తమ భూములను కూడా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని గట్టిగా నిలదీశారు. దీంతో హడావుడిగా తంతు ముగించుకుని.. కంపెనీ నిర్వాహకులు, రియల్టర్‌లు అక్కడి నుంచి జారుకున్నారు. ప్రైవేటు కంపెనీ ముసుగులో ఇద్దరు రియల్టర్‌లు, న్యామద్దలకు చెందిన మరికొందరు తమ భూములను కాజేశారని బాధిత రైతులు వాపోయారు. సుమారు 20 మంది రైతులకు సంబంధించి 30 ఎకరాల పట్టా భూములను కాజేశారని వారు ఆరోపించారు. తమకు జరిగిన అన్యాయం గురించి ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సూచించారని అన్నారు. కంపెనీ వారు, రియల్టర్లు కుమ్మక్కై.. ఒకరిద్దరికి భూములను రిజిస్ట్రేషన్ చేయించి తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని అన్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ అనిల్ కుమార్‌ను వివరణ కోరగా, ఇద్దరు రైతులకు పెండింగ్ రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు.

కన్నా.. వస్తున్నా.. నీ కోసం..!

కొడుకు ప్రాణం విడిచిన రైల్వే ట్రాక్‌పై.. తండ్రి బలవన్మరణం


రమేష్‌బాబు

ఒక్కగానొక్క కొడుకు..! కారణమేమిటోగానీ, ఏడాది క్రితం రైలు కిందపడ్డాడు. కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. గుండెలపై పెరిగిన కొడుకు అనూహ్యంగా కనుమరుగు కావడంతో తండ్రి జీర్ణించుకోలేకపోయాడు. రోజులు గడుస్తున్నా.. కొడుకు జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉన్నాయి. తన ముద్దుల కొడుకు మాయమైన రైలు పట్టాలపై నిత్యం తిరుగుతుండేవాడు. పోయినవాడు తిరిగి రాడన్న వాస్తవాన్ని గ్రహించలేకపోయాడు. వెతికి వెతికి.. అలసి.. కొడుకు పయనించిన మార్గంలోనే తానూ అనంత లోకాలకు బయలుదేరాడు. కన్నీటికే కన్నీరొచ్చే ఈ విషాద ఘటనకు గుత్తికోట రైల్వే స్టేషన్ వేదిక అయింది.
తాడిపత్రి టీచర్స్ కాలనీకి చెందిన రమేష్‌బాబు(53) మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహాన్ని గుత్తి కోట రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పోలీసులు గుర్తించారు. కొడుకు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న తరువాత.. తరచూ రైలు పట్టాలపై రమేష్ బాబు తిరుగుతుండేవాడు. గుత్తి కోట రైల్వే స్టేషన్‌లో అప్పుడప్పుడూ మౌనంగా తిరుగుతూ కనిపించేవాడని స్థానికులు చెబుతున్నారు. కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. **- గుత్తి**

గొంతు కోసుకున్న యువకుడు

పెనుకొండ రూరల్, అక్టోబరు 8: మండలంలోని అలీంబాషా అనే యువకుడు గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మంగళవారం జరిగింది. సీఐ రాఘవన్ తెలిపిన మేరకు కొడికొండ గ్రామానికి చెందిన అలీంబాషా పాలసముద్రం సమీపంలోని ఎస్ఎల్‌పి కంపెనీలో పని చేసేవాడు. అదే కంపెనీలో గుట్టూరుకు చెందిన ఓ యువతి పని చేసేది. ఈక్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. దీన్ని అలుసుగా తీసుకుని అలీంబాషా ఆ యువతిని వేధించేవాడు. అయినా ఆ యువతి మౌనంగా భరించింది. ఏడాది కిందట ఆమెకు వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె 9నెలల గర్భవతి. ఈ క్రమంలో మంగళవారం గుట్టూరుకు వెళ్లిన అలీంబాషా ఆమె ఇంటి ఎదుట గొడవపడి రభస చేశాడు. దీంతో గ్రామస్థులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో మనస్తాపం చెందిన అలీంబాషా అక్కడే తన వెంట తెచ్చుకున్న చాకుతో గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల సమాచారంతో కియ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అమ్మాయి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టమోటా కిలో రూ.50



అనంతపురంరూరల్, అక్టోబరు 8: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.35, కనిష్ఠ ధర రూ.23 పలికినట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి: డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 8: ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు శిక్షణా సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5050 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ శిక్షణ ఇస్తున్నాయని తెలిపారు. ఎంపానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణా సంస్థలు గత రెండు డీఎస్సీ నియామకాలకు శిక్షణ ఇచ్చి ఉండాలని అన్నారు. వారిద్వారా గతంలో కనీసం వంద మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొంది ఉండాలని అన్నారు. మూడు సంవత్సరాల టర్నోవర్ కనీసం రూ.40 లక్షలు ఉండాలని అన్నారు. వివరాలతో కూడిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ డాక్యుమెంట్ నంబర్ 757795ను ఏపీ ఈ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 21 వరకూ అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు దామోదరం సంజీవయ్య సంక్షేమ భవనంలోని ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌ల ప్రక్రియను పూర్తి చేయండి

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు అర్హులైన విద్యార్థుల కొత్త, రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ కళాశాల ప్రిన్సిపాళ్లను కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్త, రెన్యువల్ చేయడానికి సేవలను జ్ఞానభూమి వి2 http://jnanabhumiv2.apcfss.in/ వెబ్ పోర్టల్ కళాశాల ప్రిన్సిపాల్ లాగిన్‌లో పొందుపరిచామన్నారు. కొత్త దరఖాస్తులు, రెన్యువల్ నమోదు ప్రక్రియను ఈ నెల 30లోపు పూర్తి చేయాలన్నారు. ఆయా కళాశాలలో స్కాలర్‌షిప్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

తల్లి, కుమార్తె అదృశ్యం... కేసు నమోదు


పద్మావతి


స్నేహ

పెనుకొండ టౌన్, అక్టోబరు 8: పెనుకొండ మండలం సీపీఎం కాలనీలో నివాసముంటున్న పద్మావతి, కుమార్తె స్నేహ కనిపించడం లేదని భర్త వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం నుంచి తల్లి కూతురు కనిపించడంలేదని చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంపద సృష్టి ఎక్కడ..?: అనంత

అనంతపురం క్రైం, అక్టోబరు 8: రాష్ట్రంలో సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఉన్న సంపదను టీడీపీ నేతలకు కట్టబెడుతున్నాడని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక దోపిడీ జరుగుతున్నా,మద్యం పాలసీలో ప్రభుత్వానికి ఆదాయం గండి పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చారని, సూపర్ సిక్స్‌తో పాటు ఉచితంగా ఇసుక అందిస్తామని, సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తామని ఊదరగొట్టారన్నారు. ఇసుకను ఇతర జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నా నియంత్రించలేని పరిస్థితి ఉందన్నారు. మద్యం షాపులకు 50వేల మంది కూడా డీడీలు తీయడం లేదన్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యాపారాలు, కాంట్రాక్టులు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కలెక్టర్, ఎస్పీలు మద్యం, ఇసుక విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు.

జీతం ఇవ్వకముందే సంతకాలు..!

- ఉరవకొండ డిగ్రీ కాలేజ్‌లో వింత రూల్స్
- అక్విటెన్స్‌పై అడ్వాన్స్‌గా సంతకాలు
- ప్రశ్నిస్తే కక్షసాధింపు
- ఇబ్బంది పడుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు



ఉరవకొండ డిగ్రీ కళాశాల

అనంతపురం విద్య, అక్టోబరు 8: కొందరు ఉన్నతాధికారుల వైఖరితో ఉరవకొండ డిగ్రీ కళాశాలలోని కాంట్రాక్ట్ లెక్చరర్లు ఇబ్బంది పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లోని డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెకర్చర్లకు క్రమం తప్పకుండా జీతాలు వస్తుంటే ...ఇక్కడ మాత్రం కొర్రీలు వేస్తున్నారు. కాంట్రాక్టు లెక్చరర్లకు జీతాలు ఇవ్వకముందే అడ్వాన్సు అక్విటెన్స్ కాపీ తీసుకుని అక్విటెన్స్ రిజిస్టర్‌పై రెవెన్యూ స్టాంప్ అతికించి దానిపై సంతకాలు తీసుకుంటున్నారు. తర్వాత ఎప్పుడో వాళ్లకు బుద్ధి పుట్టినపుడు జీతం ఇస్తున్నారు. ఇదెక్కడి నిబంధన అని ఎవరైనా ప్రశ్నిస్తే జీతాలు పెట్టకుండా నెలల తరబడి ఆపేస్తున్నారు.

కొత్త రూల్స్‌తో చుక్కలు

లెక్చరర్లకు 300301 పద్దు కింద జీతాలు చెల్లిస్తున్నారు. ఎక్కడేగాని అడ్వాన్స్ అక్విటెన్స్ కాపీలు కానీ, అక్విటెన్స్ రిజిస్టర్‌లో రెవెన్యూ స్టాంప్స్ అతికించి, దానిపై సంతకాలు తీసుకోవడం గానీ లేదు. చాలా కళాశాలల్లో ఇలాగే ఉంది. అక్విటెన్స్‌పై సంతకాలు చేస్తే జీతం తీసుకున్నట్లు లెక్క. అయితే ఉరవకొండ కాలేజ్‌లో మాత్రం మా రూల్స్ మావి అన్నట్టుగా అడ్వాన్స్ అక్విటెన్స్‌లు తీసుకుంటున్నారు. ఇటీవల చాలా మంది లెక్చరర్ల ద్వారా ఇలాగే తీసుకున్నారు. జీవో 128 మేరకు అడ్వాన్స్ అక్విటెన్స్ అవసరం లేదని కళాశాల ఉన్నతాధికారులకు చెప్పినా, ట్రెజరీలో ఎస్టీఓ ఒప్పుకోవడం లేదని కుంటిసాకులు చెబుతూ...కాంట్రాక్టు లెక్చరర్ల జీతాలకు కొర్రీలు వేస్తున్నారు. అక్విటెన్స్ కాపీలు ఇవ్వని వారికి జీతాలు నిలిపేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 4 నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదు. ఒక లెక్చరర్‌కు జూన్ 2024 నుంచి సెప్టెంబరు 2024 వరకూ చెల్లించలేదు. నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కళాశాల ఉన్నతాధికారులపై కాంట్రాక్టు లెక్చరర్లు మండిపడుతున్నారు.

మాకు నాన్ టీచింగ్ స్టాఫ్ లేరు

మా కళాశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్ లేరు. డీడీఓగా నా బాధ్యతలు నాకుంటాయి. నాకు పని ఒత్తిడి ఉంటుంది. కాంట్రాక్టు లెక్చరర్లకు టైంకి జీతాల బిల్లులు పెడుతున్నాం. అక్విటెన్స్ లేకుంటే ట్రెజరీలో రిజెక్ట్ చేసే అవకాశం ఉంది. అందుకే అడ్వాన్స్ అక్విటెన్స్ తీసుకుంటున్నాం. గత కొంత కాలంగా ఇలాగే చేస్తున్నాం.

- రామకృష్ణ, ప్రిన్సిపాల్, డిగ్రీ కాలేజ్, ఉరవకొండ

హనుమద్ వాహనంపై శ్రీనివాసుడు



హనుమద్ వాహనంపై స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 8 : ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజున మంగళవారం హనుమద్ వాహనంపై శ్రీనివాసుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్లకు సుప్రభాత సేవ, పుష్పాలంకరణ, తోమాల సేవ నిర్వహించా రు. సాయంత్రం ఉత్సవ మూర్తులను హనుమద్ వాహనంపై ఆశీనులను చేశారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ శ్రీవారిని ఊరేగించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

డ్వామా పీడీకి వాటర్‌షెడ్ ఉద్యోగుల సన్మానం



పీడీ సలీంబాషాను సన్మానిస్తున్న ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 8: తాజాగా బాధ్యతలు స్వీకరించిన డ్వామా పీడీ సలీంబాషాను వాటర్‌షెడ్ ఉద్యోగులు సన్మానించారు. వాటర్‌షెడ్ అదనపు పీడీ సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో మంగళవారం డ్వామా పీడీ సలీంబాషాను పుష్పగుచ్ఛం, శాలువతో ఘనంగా సత్కరించారు. వాటర్‌షెడ్ ద్వారా జిల్లాలో రైతులకు, ప్రజలకు ఉపయోగకరమైన సేవలను అందించాలని పరస్పరం తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీఓ ఈశ్వరయ్య, ఈపీడీ కృష్ణచైతన్య, టెక్నికల్ ఆఫీసర్ మునగల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాపై రెండోరోజు విచారణ

అనంతపురం అర్బన్, అక్టోబరు 8: విడపనకల్లు మండలం డొనేకల్లులో 2021 ఖరీఫ్‌కు సంబంధించి అనర్హులకు పంటల బీమా వర్తింపుపై వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఆడిట్ బృందం అధికారులు విచారణ కొనసాగించారు. రెండోరోజు మంగళవారం ఉరవకొండ ఏడీ కార్యాలయానికి కమిషనరేట్ ఆడిట్ బృందం వెళ్లింది. డొనేకల్లు గ్రామంలోని పలువురు అనర్హులకు రూ.10.39 లక్షల పంటల బీమా సొమ్ము జమ కావడం పట్ల పలు రికార్డులను పరిశీలించారు. అలాగే 2019 ఖరీఫ్‌లో నకిలీ కూపన్లతో విత్తన వేరుశనగ పంపిణీ చేశారన్న ఆరోపణలపైనా ఆడిట్ అధికారులు విచారణ చేపట్టారు.

ఉద్యోగాలకు 35మంది ఎంపిక

నార్పల, అక్టోబరు 8: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడప్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాధి కారి పీవీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు వివిధ రంగాలకు చెందిన రెండు కంపెనీలు పాల్గొన్నాయి. ఇంటర్వ్యూలకు హాజరైన 69మంది అభ్యర్థుల్లో 35మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపైనే ప్రజల ఆకాంక్ష : సందిరెడ్డి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 8: దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం ఉండాలనే ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, అందుకు హరియాణా, జమ్ముకశ్మీర్ సార్వత్రిక ఎన్నికలే నిదర్శనమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ హరియాణా రాష్ట్రంలో మూడో సారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు అక్కడి ప్రజలు మద్దతు తెలిపారన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుచేసినప్పటికీ బీజేపీకి గణనీయంగా ఓటు శాతం పెరిగిందన్నారు. భవిష్యత్తులో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

సస్యరక్షణతో మంచి దిగుబడులు : ఏడీఏ

అనంతపురం రూరల్, అక్టోబరు 8: సస్యరక్షణ చర్యలతో వేరుశనగ, కంది పంటల్లో మంచి దిగుబడులు సాధించవచ్చునని అనంతపురం డివిజన్ వ్యవసాయాధికారి రవి అన్నారు. మండలంలోని అక్కంపల్లి, రాచానపల్లిల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీ రవి హాజరయ్యారు. ఏఓ శశికళ, ఏపీఎంఐపీ అధికారి హరిత, ఏఈఓ మురళీకృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారి రామాంజినేయులు, సహాయకులు శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

నార్పల: మండలంలోని సోదనపల్లి, గంగనపల్లిల్లో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పొలాలను పరిశీలించారు. ఆత్మప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, జిల్లా రైతు కేంద్రం ఏడీ శైలజ కుమారి, తాడిపత్రి డివిజన్ ఏడీ చంగల్‌రాయుడు, మండల వ్యవ సాయాధికారి సీ చన్నవీరస్వామి, ఏఈఓ రాము, సిబ్బంది సుశీల, సర్పంచు కుళ్లాయిరెడ్డి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

గార్లదిన్నె, అక్టోబరు 8: మండలకేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం రాత్రి మట్కా బీటర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. గార్లదిన్నెకు చెందిన వ్యక్తి మట్కా రాస్తున్నట్లు సమాచారంతో అబ్దుల్లాను అరెస్టు చేసి రూ. 10150 నగదును , మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

అనంతపురం క్రైం, అక్టోబరు 8: నగర శివారులో వ్యాన్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డికి చెందిన హాజీవలి(18) ఇంటర్ చదువుతున్నాడు. మంగళవారం ఉదయం ప్రధాన రహదారిలో వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన వ్యాన్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన హాజీవలిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి రిమాండ్

అనంతపురం క్రైం: ఏడేళ్ల బాలికపై అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిని అనంతపురం రూరల్ పోలీసులు రిమాండ్‌కు పంపారు. నగరంలోని జాకీర్ కొట్టాలకు చెందిన రవీంద్ర సోమవారం ఏడేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. అతడిని మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అనంతపురం క్రైం: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పాతూరులో ఓ వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా వన్‌టౌన్ సీఐ రాజేంద్ర నాథ్‌యాదవ్ ఆదేశాల మేరకు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఆత్మకూరు, అక్టోబరు 8: ఎటువంటి అనుమతులు లేకుండా సమీప కాలువపల్లి ఏరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రభుత్వ అనుతులు వచ్చేవరకు ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

'నాడు-నేడు' అంటే ఇదేనా..?

- వైసీపీ పాలనపై ఎమ్మెల్యే దగ్గుపాటి మండిపాటు
- హౌసింగ్ బోర్డులో 'మీ ఇంటికి.. మీ ఎమ్మెల్యే'



వృద్ధురాలి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, అక్టోబరు 8: నాడు-నేడు అంటూ ఊదరగొట్టిన గత వైసీపీ ప్రభుత్వం పాలన ఎలా ఉందో చెప్పడానికి... నగరంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలే నిదర్శనమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. 'మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం రెండో రోజు స్థానిక హౌ సింగ్ బోర్డులో పర్యటించారు. స్థానికంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు పింఛన్లు రావడం లేదని తెలుపగా, మరికొందరు తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే హమాలీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలను చూసి ఎమ్మె ల్యే తీవ్రంగా స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని, అయితే ఇలాంటి శిథిలావస్థ పాఠశాలపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయల్ మురళి, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, తమ్మినేని వేణుగోపాల్, గుర్రం నాగభూషణం, లక్ష్మీనరసింహ, నారాయణస్వామి యాదవ్, గంగారామ్, ఫిరోజ్ అహ్మద్, కాశీ విశ్వనాథ్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీ లక్ష్మీ, సరిపూటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన అధికారులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 8: ఎమ్మెల్యే పరిటాల సునీతను పలువురు అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం రాత్రి అనంతపురం నగరంలోని ఆమె నివాసంలో డ్వామా పీడీ సలీం బాషా, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య, రాప్తాడు గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ.. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డ్వామా పీడీ

ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు రప్పించండి

- వ్యవసాయ మంత్రికి ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ లేఖలు





మంత్రికి పంపిన లేఖలు చూపుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 8 : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీఈఓలను వెంటనే తిరిగి జిల్లాకు పంపేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తమ లేఖలను మెయిల్ ద్వారా పంపారు. ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, పలువురు ఎంపీఈఓలు మంగళవారం రాత్రి అనంతపురంలోని ఆ ఇద్దరు ఎమ్మెల్యేల నివాసాల్లో వారిని కలిశారు. తమ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీ ప్రభుత్వంలో అవసరం లేకపోయినా తమను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపడంతో అక్కడ ఇబ్బందులు పడుతూ పనిచేస్తున్నామని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యేలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రితోపాటు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌కు తమ లేఖలను మెయిల్ ద్వారా పంపారు. చిత్తూరులో పనిచేస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీఈఓల ఓడీని రద్దు చేసి తిరిగి జిల్లాకు పంపేలా తక్షణం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఘనంగా భారతీయ వైమానికదళ దినోత్సవం



పాల్గొన్న మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 8: భారతీయ వైమానిక దళ 92 వ దినోత్సవాన్ని మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కెప్టెన్ షేకన్న, సంఘం సభ్యులు ఈశ్వరయ్య, బీఏ హుస్సేన్, పెంచలయ్య, ప్రసాద్, సిద్దన్న, నబీరసూల్, ఇస్మాయిల్, రామాంజనేయులు, బషీర్ అహ్మద్, టీవీ రత్నయ్య, అబ్దుల్ వహాబ్, ఆర్ఎస్ నాగరాజు, సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవులను ఓబీసీలో చేర్చేందుకు సహకరించండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న వీరశైవ లింగాయతులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 8: వీరశైవ లింగాయతులను ఓబీసీలో చేర్చడం ద్వారా వారి అభ్యున్నతికి తమ వంతు సహకారమందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను జిల్లా వీరశైవ సమాజం నాయకులు కోరారు. కేంద్ర ఓబీసీ కమిటీ సభ్యుడు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను మంగళవారం సాయంత్రం జిల్లా వీరశైవ సమాజం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంపీ స్పందిస్తూ వీరశైవ లింగాయతులను ఓబీసీలుగా పరిగణించేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీని వారు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం నాయకులు సతీష్‌కుమార్, బసవరాజు, సాంబశివుడు, రవిశంకర్, ఉమాశంకర్, శివకుమార్, రాంభూపాల్, టీచర్ సతీష్, మఠం ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

- రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న లక్ష్మానాయక్

అనంతపురం అర్బన్, అక్టోబరు 8 : ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ సూచించారు. స్థానిక ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ శిక్షకులకు పలు అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల సాగులో తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, ఆగ్రో క్లైమాటిక్ జోన్స్, వర్షపాతం, తేమ శాతం, నేలల్లో తేమ సంరక్షణ విధానాలు, రసాయన వ్యవసాయం ద్వారా కలిగిన అనర్థాలపై అవగాహన కల్పించారు.

హమాలీ కాలనీలోని పాఠశాల వద్దకు రా..!

- మీరు చేసిన నాడు- నేడు పనులు ఏంటో చూపిస్తాం
- తెలుగు యువత నాయకుడు సుధాకర్‌యాదవ్ సవాల్



మీడియాతో మాట్లాడుతున్న సుధాకర్ యాదవ్

అనంతపురం అర్బన్, అక్టోబరు 8 : ధైర్యం ఉంటే హమాలీ కాలనీలోని పాఠశాల వద్దకు రావాలని, మీరు చేసిన నాడు - నేడు పనులు ఏంటో చూపిస్తామని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్ మేయర్ వసీంకు సవాల్ విసి రారు. ఆయన మంగళవారం స్థానిక టీడీపీ అర్బన్ కార్యాలయంలో పార్టీ నాయకులు తమ్మినేని వేణుగోపాల్, అమర్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అమూల్ బేబీ వసీం ...వాస్తవాలు ఏంటో ప్రజల్లోకి వచ్చి తెలు సుకోవాలని హితవు పలికారు. మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే పేరుతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రజల్లోకి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే దాన్ని జీర్ణించుకోలేని మేయర్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. హమాలీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల వద్ద దుస్థితిని చూసిన ఎమ్మెల్యే స్పందించారని అన్నారు. మీకు ధైర్యం ఉంటే బుధవారం ఉదయం పాఠశాల వద్దే ఉంటామని, మీరు చేసిన పనులను చూపించగలరా అని ప్రశ్నించారు. అభివృద్ధిలో సహకారం అందిస్తే కలిసి పనిచేస్తామని.. ఎమ్మెల్యేపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఎరా స్కూల్‌లో దసరా వేడుకలు



దసరా వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు తదితరులు

అనంతపురం రూరల్, అక్టోబరు 8: మండలంలోని రాచానపల్లి సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో దసరా వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఈకార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి సతీమణి సుశీలరెడ్డి, చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. నవరాత్రుల వైభవాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శారదా శ్లోకాన్ని భక్తిశ్రద్ధలతో పఠించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, రావణ దహనం కార్యక్రమాన్ని ప్రదర్శించారు.. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డిగ్రీ ఇయర్‌వైజ్ పరీక్షలు ప్రారంభం

- నవంబరు 1నుంచి ప్రాక్టికల్స్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 8: ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ ఇయర్‌వైజ్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల, కేఎస్ఎన్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. తొలిరోజు నిర్వహించిన ఇంగ్లీష్ సబ్జెక్టుకు 250మంది విద్యార్థులు హాజరైనట్లు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ పేర్కొన్నారు. ఈ నెల 28 వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. సైన్స్ విద్యార్థులకు నవంబరు 1నుంచి 3 వరకు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు పరీక్షా కేంద్రాలను తనఖీచేశారు.

కార్మిక చట్టాలను అమలు చేయాల్సిందే..!

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్
- సామ్‌సంగ్ షోరూం ఎదుట ధర్నా



సామ్‌సంగ్ షోరూం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 8: సామ్‌సంగ్ ఇండియా బహుళ జాతి సంస్థ యాజమాన్యం దేశీయ చట్టాలను గౌరవించదా..? అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ప్రకారం కార్మిక చట్టాలను పాటించా ల్సిందేనని డిమాండ్ చేశారు. తమిళనాడు పెరంబదూర్ సామ్‌సంగ్ ప్లాంట్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపుమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న సామ్‌సంగ్ షోరూమ్ ఎదుట సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ... దక్షిణ కొరియాకు చెందిన బహుళజాతి సంస్థ సామ్‌సంగ్ ప్రపంచవ్యాప్త వ్యాపారంలో 20శాతం లాభాలను మన దేశం నుంచే తీసుకుంటోందన్నారు. దక్షిణ కొరియాలో పనిచేసే కార్మికులకు 13వేల డాలర్లు చెల్లిస్తూ, మనదేశ కార్మికులకు 300 డాలర్లు మాత్రమే చెల్లిస్తోందన్నారు. తమిళనాడు ప్రభుత్వం పెట్టుబడుల కోసం కార్మికుల పోరాటాలను పోలీసుల నిర్బంధంతో ముగించాలని చూస్తే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, బండారు ఎర్రిస్వామి, తిరుమలేష్, నాగరాజు, ఆజాంబాషా, భాస్కర్, జిలాన్‌బాషా, శ్రీనివాసమూర్తి, కుమార్, హరి, పెద్దకుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



మొదటిరోడ్డులో చౌడేశ్వరిమాతకు నాణేలతో అలంకరణ



దుర్గమ్మ చౌక్‌లో దుర్గామాత

మహాలక్ష్మీ నమోస్తుతే..!

దసరా నవరాత్రి ఉత్సవాల ఆరోరోజు మంగళవారం అమ్మవారు పలుప్రాంతాల్లో లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. జిల్లాకేంద్రంలోని వివిధ ఆలయాల్లో మూలవిరాట్లతోపాటు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలవిరాట్‌ను వక్కలతో అలంకరించి, ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులతో కంచికామాక్షి, వాసవీదేవి, సంతోషిమాత అలంకారం చేశారు. పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలవిరాట్‌ను లేసులతో అలంకరించి, ఆలయ ఆవరణలోని ఉత్సవమూర్తులతో గంగాసమేత శివపార్వతుల అలంకారం చేసి పూజాకైంకర్యాలు నిర్వహించారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను పార్వతీదేవిగా, ఉత్సవమూర్తిని ఇంద్రాణిగా అలంకరించి గజవాహనంపై ఆశీనులను చేశారు. రామచంద్రనగర్ షిర్డీసాయి ఆలయంలో రూ.10లక్షల నగదుతో మహాలక్ష్మీ దేవి అలంకారం చేశారు. పాతూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఉన్న కాళికామాత ఆలయంలో లలితాదేవిగా, శివబాలయోగి ఆశ్రమంలో మీనాక్షిదేవిగా అలంకరించారు. శంకరమఠంలోని శారదాదేవిని వీణాసరస్వతిగా అలంకరించి, 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. జొన్నా వీరయ్య కాలనీలోని శివశక్తి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించి, భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. -అనంతపురం కల్చరల్



పాతూరు అమ్మవారిశాలలో ఎమ్మెల్యే పరిటాల సునీతను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు



కొత్తూరు అమ్మవారిశాలలో మాజీ మేయర్ స్వరూపను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు



అర్బన్‌బ్యాంకులో పూజలు చేస్తున్న ఎంపీ అంబికా, చైర్మన్ జేఎల్ మురళీధర్

దేవీనవరాత్రుల్లో భాగంగా సుభాష్‌రోడ్డులోని అర్బన్ బ్యాంకులో ఆరో రోజు మంగళవారం మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్‌తో కలిసి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారికి అలంకరించిన హారాన్ని బ్యాంకు డైరెక్టర్ రామాంజినేయులు రూ.20వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గసభ్యులు గోల్డ్‌బాషా, వడ్డే వెంకటాద్రి, రొళ్ల బాస్కర్, రామాంజినేయులు, చంద్రశేఖర్, కృష్ణకుమాంర్, రమణయ్య, సుంకర రమేష్, సీఈఓ విజయభాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు. -అనంతపురం క్లాక్‌టవర్

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

నార్పల, అక్టోబరు8: కిశోర బాలికలు తప్పనిసరిగా పౌష్టికా హారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ భారతి పేర్కొ న్నారు. మండల కేంద్రంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో మం గళవారం కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు మధుమాలిని, రాజమణి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ లావణ్య, కార్యకర్త కుళ్లాయమ్మ పాల్గొన్నారు.

'పాలస్తీనాపై దాడులను ఆపాలి'



నిరసన తెలుపుతున్న సీపీఐ, ఇన్సాఫ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 8 : పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని సీపీఐ, ఇన్సాఫ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయా సంఘాల నాయకులు సప్తగిరి సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్, ఇన్సాఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు అల్లీపీరా తదితరులు మాట్లాడుతూ.. అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ ఏడాదిగా పాలస్తీనాపై దాడులు చేస్తూ... అమాయకులు, పసి పిల్లలు, మహిళలు, వృద్ధులు, సామాన్య ప్రజలను 86 వేల మందిని పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్, ఇన్సాఫ్ నగర అధ్యక్షుడు చాంద్‌బాషా, కార్యదర్శి సూఫీ ఖాజా హుస్సేన్, ఇతర నేతలు శ్రీనివాస్, సురేంద్ర పాల్గొన్నారు.


గుత్తిలో వారాహి మాత అలంకరణలో వాసవీమాత


గుంతకల్లులో వైష్ణవీదేవి అలంకరణలో కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారు


ఉరవకొండలో మహాలక్ష్మి అలంకరణలో ఈశ్వరమ్మ దేవి



పామిడిలో లలితాదేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు


భోగేశ్వరాలయంలో మహాలక్ష్మిగా ప్రసన్న పార్వతీమాత


బెళుగుప్పలో మహాలక్ష్మిగా తగ్గుపర్తమ్మ


రాయదుర్గంలో ఆదిశక్తి రూపంలో దర్శనమిచ్చిన మహాలక్ష్మిదేవి


సేవాఘడ్‌లో మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో మాతాజగదాంబ


యాడికిలో వారాహి దేవి అలంకరణలో పెద్దమ్మతల్లి

మహాలక్ష్మిగా అమ్మలగన్న అమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతరలు పురాతన సంస్కృతికి ఆనవాళ్లు

- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, అక్టోబరు 8: జాతరలు పురాతన సంస్కృతికి ఆనవాళ్లని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన మారెమ్మ, తాయమ్మ దేవతల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. పురాతన కాలం నుంచి గ్రామదేవతల జాతర నిర్వహణ జరుగుతోందని, కణేకల్లులో జాతరలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆయా ఆలయ నిర్వాహకులు కురుబ నాగరాజు, అనిల్, వెంకటేశులు, నాగభూషణం, గోపాల్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోళకుర్తి సుదర్శన్, టీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి: వైద్యులు


రాయదుర్గంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

రాయదుర్గంరూరల్, అక్టోబరు 8: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ఆజాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యకర్త, ఆరోగ్య కార్యదర్శి అనుమానితుల నుంచి రక్తనమూనాలను సేకరించి ఎప్పటికప్పుడు అర్బన్ హెల్త్ సెంటర్‌కు పంపాలన్నారు. వైద్యసిబ్బంది కలిసి డ్రైడే-ఫ్రైడే నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఫీవర్, లార్వాసర్వే, పరిసరాల పరిశుభ్రతపైన అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీ, నరసమ్మ, ఏఎన్‌ఎంలు సరోజ, విజయలక్ష్మీ, శోభ, ప్రమీల, లలిత పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు మలేరియా జిల్లా అధికారి ఓబులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ తదితర జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డాక్టర్లు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక, సూపర్‌వైజర్ వెంటరమణ ఎంపీహెచ్‌ఈవో విజయ్ కుమార్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'మీ పాలనలో అరాచకాలను మరిచావా..?'

పుట్లూరు, అక్టోబరు 8: గత ఐదేళ్ల మీ పాలనలోని అరాచకాలు, అన్యాయాలను మరిచావా..? అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డిని టీడీపీ మాజీ మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇసుక విషయంలో మీ పార్టీ నాయకులు, మీరు మాట్లాడడం దారుణమన్నారు. వంకలు, వాగుల్లో ఇసుక లేకుండా చేసిన చరిత్ర మీకే దక్కుతుందన్నారు. తమ అధినేత చంద్రబాబు, లోకేశ్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మీ హయాంలో ముచ్చు కోట కొండల్లో అక్రమ మైనింగ్ మరిచిపోయారా అంటూ ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని హితవు పలికారు.

చిరుత దాడిలో మేక మృతి

శెట్టూరు, అక్టోబరు 8: మండల పరిధిలోని చిన్నంపల్లి గ్రామంలో రైతు గొల్ల కదిరప్పకు చెందిన మేక మంగళవారం చిరుత దాడిలో మృతిచెందింది. చిరుత దాడి నుంచి కాపాడుకోవాలని అటవీ శాఖ అధికారులను అతను కోరాడు.

ఈ-పంట నమోదు పరిశీలన

బ్రహ్మసముద్రం, అక్టోబరు 8: మండల పరిధిలోని పిల్లలపల్లి గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయాధికారులు సమష్టిగా ఈ పంట నమోదు నిర్వహించారు. ఈక్రాప్ బుకింగ్ నిర్వహించారా..? తదితర వివరాలను బ్రహ్మసముద్రం తహసీల్దార్ సుమతి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వీఆర్‌ఓ, హార్టికల్చర్ అధికారులు ఉన్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

జేసీ శివనారాయణ శర్మ

గుంతకల్లుటౌన్, అక్టోబరు 8: వ్యవసాయంలో రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. మండలంలోని తిమ్మనచెర్ల, కసాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ రైతులు పంట సాగులో మెలకువలను పాటిస్తే పంట దిగుబడి వస్తుందన్నారు. తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ ఆదాయం వచ్చేలా వ్యవసాయం చేయాలన్నారు. పంటనమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం మట్టి నమూనా పత్రాలను రైతులకు జేసీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రమాదేవి, మండల వ్యవసాయ అధికారి స్వాతి పాల్గొన్నారు.


పవర్‌గ్రిడ్ స్థలంలో మొక్కలు నాటుతున్న జేసీ

పవర్‌గ్రిడ్ నిర్మాణ స్థల పరిశీలన

గుంతకల్లుటౌన్: మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద నూతనంగా నిర్మించనున్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సంస్థకు రైతుల నుంచి సేకరించిన స్థలాన్ని మంగళవారం జేసీ శివనారాయణ శర్మ పరిశీలించారు. నిర్మాణం వివరాలను ఆర్డీఓ, తహసీల్దారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మొక్కలు నాటారు. అదేవిధంగా గుంతకల్లు పట్టణంలో మూతపడిన స్పిన్నింగ్ మిల్లును పరిశీలించారు. మిల్లులోని యంత్రాలను, దూది, దారం తయారు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దారు రమాదేవి ఉన్నారు.

మెరుగైన సేవలు అందించండి

ఉరవకొండ/కూడేరు: తహసీల్దారు కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. నియోజకవర్గంలోని కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు తహసీల్దార్ కార్యాలయాలని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. తహసీల్దారు కార్యాలయాల్లోని రికార్డు గదులను పరిశీలించారు. రికార్డులను క్రమపద్ధతిలో అమర్చి వాటి వివరాలను తెలిపే విధంగా సూచన కార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రికార్డు గదికి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం ఉంటే చర్యలు ఉంటాయన్నారు. భూమి సమస్యలు, రెవెన్యూ సేవల మీద ప్రత్యేక దృష్టిని ఉంచి వాటిని నిర్ణయించిన సమయంలో పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు మహబూబ్ బాషా, నసీర్ అహ్మద్ పాల్గొన్నారు.

దేవదాయ భూములు పేదలకు పంచండి

తహసీల్దార్‌కు సీపీఐ నాయకుల వినతి

బొమ్మనహాళ్, అక్టోబరు 8: మండలంలో దేవదాయకు సంబంధించిన భూములను పేదలకు పంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి, నాయకులు కొత్రేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ మునివేలును కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్దేహాళ్ గ్రామంలోని బళ్లారి రామస్వామి దేవాలయానికి సంబంధించి 224/ఎ సర్వే నంబర్‌లో 3.79 ఎకరాల భూమిని 2022లో మిగులు భూమిగా చిత్రీకరించి ఆక్రమించుకున్నారన్నారు. ఇదే గ్రామంలో మరో 20 ఎకరాలు ఆక్రమించుకున్నారని వివరించారు. లింగదహాళ్, కృష్ణాపురం, కొళగానహళ్లి తదితర గ్రామాల్లోని ఈశ్వరస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల భూములు పెద్ద భూస్వాములే సాగు చేసుకుంటున్నారని వీటిని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. అర్హులకు సైతం సహాయం అందడం లేదని భూస్వాములు, ధనికులు దేవాలయ భూములను ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. భూములను స్వాధీనం చేసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

డిప్యూటీ తహసీల్దార్‌గా సురేష్‌బాబు



రాయదుర్గంరూరల్, అక్టోబరు 8: డిప్యూటీ తహసీల్దార్‌గా సురేష్‌బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రామాంజినేయులు డీ.హీరేహాళ్ మండలం నుంచి రాయదుర్గానికి బదిలీపై వచ్చారు. పంచాయతీరాజ్ కార్యాలయంలో ఏఈగా మునిస్వామి బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయంలో సూపరిండెంట్‌గా శ్రీనివాసరెడ్డి అనంతపురం జడ్పీ కార్యాలయం నుంచి రాయదుర్గానికి బదిలీపై వచ్చారు. ఈఓపీఆర్డీ మురళీకృష్ణ శింగనమల నుంచి రాయదుర్గం బదిలీ అయి బాధ్యతలు చేపట్టారు.

బాధ్యతల స్వీకరణ

బెళుగుప్ప: మండల కేంద్రంలో సెక్రటరీగా మంగళవారం శివరంజని బాధ్యతలు చేపట్టారు. కూడేరు మండలం ఉదిరిపికొండ పంచాయతీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

నేడు, రేపు శిక్షణ తరగతులు

బొమ్మనహాళ్, అక్టోబరు 8: మండలంలోని 19 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు బుధ, గురువారాల్లో రెండురోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ దాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, పంచాయతీల నిర్వహణ, నిధులు, విధులపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ తరగతులకు సభ్యులు హాజరు కావాలని కోరారు.

14 నుంచి పల్లె పండుగ

మండలవ్యాప్తంగా ఈనెల 14వ తేదీ నుంచి పల్లె పండుగ నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ దాస్ తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, గోకులం షెడ్లు, సంక్రాంతి లోపు పూర్తి చేయాలన్నారు. వారంరోజులపాటు పనుల ప్రారంభాన్ని పండుగలా చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు.

అపిలేపల్లిలో కార్డెన్‌సెర్చ్

కుందుర్పి, అక్టోబరు 8: మండల పరిధిలోని అపిలేపల్లి గ్రామంలో మంగళవారం రూరల్ సీఐ నీలకంఠేశ్వర కుందుర్పి ఏఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇంట్లో సోదాలు నిర్వహించారు. అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న యర్రిస్వామి వద్ద నుంచి 90 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మట్కాబీటర్లను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి, అక్టోబరు 8: పట్టణంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం వేకువజామున పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పెన్నానది నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుండడంతో అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ యుగంధర్ హెచ్చరించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దవడుగూరు, అక్టోబరు 8: మృతుడి కుటుంబానికి తెలుగు యువత పార్లమెంటు సభ్యుడు దివాకర్‌రెడ్డి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశాడు. చింతలచెరువు గ్రామానికి చెందిన నాగేష్ విద్యుదాఘాతంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దివాకర్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశాడు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఆదిరెడ్డి, షెక్షావలి ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

బ్రహ్మసముద్రం, అక్టోబరు 8: మండల పరిధిలోని కన్నేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ బొమ్మ హనుమక్క అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. విషయాన్ని తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచ్ మల్లికార్జునప్ప, మాజీ ఎంపీటీసీ నాగరాజు, నాయకులు సుభాన్, శిరియన్న, రామన్న తదితరులు నివాళులర్పించారు.

స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు టీడీపీ నాయకుల వినతి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 8: శాంతినగర్‌లోని వైఎస్సార్ విగ్రహం వెనుక ఉన్న 10 సెంట్ల స్థలాన్ని కబ్జాకు గురికాకుండా చూడాలని టీడీపీ నాయకులు బూదూరు తిప్పేస్వామి, రాజశేఖర్, ఎల్లప్ప, వెంకటేశులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా కాపాడాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న బద్దేనాయక్

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 8: మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో లివర్ సమస్యతో బాధపడుతున్న మహేంద్రకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ ఆర్థికసాయం అందజేశారు. ప్రతినెలా రూ. 12 వేలు మందులకు ఖర్చవుతుందని తెలుసుకుని ఆర్థికసాయం చేస్తున్నారు. ప్రతినెలా రూ. 12 వేల విలువచేసే మందులను ఆయన అందజేస్తున్నారు. అందులోభాగంగా మంగళవారం రూ. 12 వేలు అందజేశారు.

అభివృద్ధికి సహకరించండి: ఎంపీడీఓ

పుట్లూరు, అక్టోబరు 8: మండల అభివృద్ధికి ప్రతిఒక్క అధికారి సహకరించాలని ఎంపీడీఓ అలివేలమ్మ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రాఘవరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంపీపీ మాట్లాడుతూ అన్నిశాఖలు సమన్వయం చేసుకొని పనులు చేయాలన్నారు. ముందుగా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తితే ఫిర్యాదు చేయాలని సూచించారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పెట్టాలని తెలిపారు. అనంతరం పలువురు అధికారులు ప్రభుత్వ పథకాలను వివరించారు. సమావేశంలో ఈఓఆర్‌డీ జిలాన్‌బాషా, డిప్యూటి తహశీల్దార్ మల్లేష్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

యాడికి, అక్టోబరు 8: అక్రమంగా తరలిస్తున్న 49 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం సీజ్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. మంగళవారం ఉదయం రాబడిన సమాచారం మేరకు కోనరోడ్డులో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని, ఆటోను పట్టుకున్నారు. 49 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనంచేసుకున్నారు. నారాయణ స్వామి, మహేంద్ర, క్రిష్ణ, రఘురాముడు, సుంకన్నలపై కేసు నమోదు చేసి, సీజ్ చేసిన బియ్యాన్ని సివిల్ సప్లయ్స్ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

'సత్వరమే కేసులను పరిష్కరించాలి'

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 8: ఎస్సీ, ఎస్టీ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఇన్‌చార్జి రెవెన్యూ డివిజన్ అధికారి వినూత్నకు విన్నవించారు. మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు విన్నవించారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, రామాంజినేయులు, ఉపేంద్ర, హరీష్, తదితరులు ఇన్‌చార్జి ఆర్డీఓను కలిసిన వారిలో ఉన్నారు.

'సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి'

గుత్తి, అక్టోబరు 8: దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయా దేవాలయాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయాల వద్ద వారంలోపు సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

గుత్తి, అక్టోబరు 8: పట్టణంలోని ఎంఎస్‌పుట్‌బాల్ క్రీడామైదానంలో మట్కా రాస్తున్న ఐదుగురిని మంగళవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.43, 250 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణానికి చెందిన ఎస్ పురుషోత్తం, ఎస్ శివ, దానమయ్య, రఘు, బెస్త వెంకటరాముడులను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

రిజర్వాయర్‌కు 1063 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 8: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 1063 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 1115 క్యూసెక్కులు వెళుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి నిల్వ 1.642 టీఎంసీలు వుందని అధికారులు వెల్లడించారు.

ఐషర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

అనంతపురం క్రైం, అక్టోబరు 8 : నగర శివారులో ఐషర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డికి చెందిన హాజీవలి(18) ఇంటర్ చదువుతున్నాడు. అతడు మంగళవారం ఉదయం ప్రధాన రహదారిలో వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఐషర్ ఢీ కొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన హాజీవలిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం'


కార్మికులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గుత్తి, అక్టోబరు 8: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రెటరీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డీజిల్ షెడ్, బాక్స్ అండ్ డిపోను, రైల్వేస్టేషన్‌ను ఆయన పరిశీలించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడీఎస్ మస్తాన్‌వలి, సెక్రెటరీ రామాంజులరెడ్డి, మనోహర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఐఓసీ డిపోలో ఉచిత వైద్య శిబిరం


మాట్లాడుతున్న వైద్యుడు కల్యాణ్‌చక్రవర్తి

గుంతకల్లుటౌన్, అక్టోబరు 8: మండలంలోని నక్కనదొడ్డి గ్రామ సమప ఐఓసీ డిపోలో ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లకు ఉచిత వైద్య పరీక్షలను మంగళవారం నిర్వహించారు. డిపో చీఫ్ మేనేజరు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు కల్యాణ్‌చక్రవర్తి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఓసీ మేనేజరు రాజేంద్ర, లైజనర్ జీఏ నజీర్, విష్ణు, చరణ్, ఎస్‌టీఐ వీరానాయక్, ఏఎన్‌ఎం నజమున్నీసా, ప్రాజెక్టు డైరెక్టర్ నూర్జహాన్, మేనేజరు రమేష్ పాల్గొన్నారు.

బొచ్చుపల్లిలో 'పొలం పిలుస్తోంది'


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

శెట్టూరు, అక్టోబరు 8: మండల పరిధిలోని బొచ్చుపల్లిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు డ్రిప్ ఉపయోగాలు, సేంద్రీయ ఎరువుల వాడకం, పంట మార్పిడి ద్వారా ఉపయోగాలు తదితర అంశాలపై వివరించారు. సబ్సిడీతో జింకు, బోరాన్ ఎరువులను పంపిణీ చేయాలని రైతులు ఆమెను ఈ సందర్భంగా కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవో గౌరీ, ఏఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

బెస్తరపల్లిలో...

కుందుర్పి: మండల పరిధిలోని బెస్తరపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారులు ఉమామహేశ్వరమ్మ, ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రిప్ ఉపయోగాలు, సేంద్రీయ ఎరువుల వాడకం పంట మార్పిడి తదితర విషయాలపై రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహేష్, స్థానిక టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ రాఘవేంద్రబాబు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

బొమ్మనహాళ్, అక్టోబరు 8: మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి నీట మునిగిన పంట పొలాలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ సాయి కుమార్ పరిశీలించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ముంచిన వర్షం శీర్షిక ప్రచురితంకావడంతో జిల్లా వ్యవసాయ అధికారి స్పందించి మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, సిద్ధరాంపురం గ్రామాల్లో పర్యటించి పంటనష్టంపై ఆరాతీశారు. నష్టపోయిన పంటలను గుర్తించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని రైతులకు తెలిపారు. సిద్ధరాంపురం గ్రామంలో జొన్న వేసి నష్టపోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా జొన్న, శెనగ విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ ఖరీఫ్‌లో ఈ పంట నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. బుధవారం ఈకేవైసీకి చివరిరోజు అన్నారు. ఈకేవైసీ ఉంటేనే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు అర్హత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు


కలెక్టర్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న తహసీల్దారు

గుత్తి, అక్టోబరు 8: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ గుత్తి తహసీల్దారు ఓబులేసుకు మంగళవారం ఐఎస్ఓ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. దీంతో కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.